బీసీలకు టికెట్లు ఇవ్వని పార్టీలకు సమాధే..

కులగణన చేస్తూ, అగ్ర కులాలకు టికెట్లు కేటాయిస్తారా?

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్

అభివాదం చేస్తున్న జస్టిస్ ఈశ్వరయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ నాయకులు

ఖైరతాబాద్, జనవరి 25: రాష్ట్ర జనాభాలో మెజార్టీగా ఉన్న బీసీలకు ఎమ్మెల్సీ టికెట్లు కేటాయించని రాజకీయ పార్టీలను సమాధి చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, పలువురు బీసీ నేతలు స్పష్టం చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో బీసీ మేధావులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కుల సంఘాల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు, ఎంబీసీ కార్పొరేసన్ మాజీ చైర్మన్ తాడూరు శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడుతూ ఓట్లు బీసీలవి, సీట్లు అగ్రకులాలకు ఇవ్వడం కాంగ్రెస్‌కు ఆనవాయితీగా మారిందన్నారు. అధికారం లేనప్పుడు ఓ మాట, అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాట మాట్లాడుతున్నారన్నారు. ఓ వైపు కులగణన చేస్తున్నామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, మరో వైపు అగ్రకులాలకు టికెట్లు ఎలా కేటాయిస్తారు? అని ప్రశ్నించారు. ఓట్లు బీసీలవి, సీట్లు అగ్రకులాలు తీసుకుంటున్నారని, ఇక ముందు అది సాధ్యం కాదన్నారు. కాంగ్రెస్, బీజేపీలు బీసీ వ్యతిరేక వైఖరిని మార్చుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అదే వైఖరిని ప్రదర్శిస్తే వారి పతనం తప్పదన్నారు. ఆ పార్టీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీల జనాభా దామాషా ప్రకారం టికెట్లు కేటాయించాలన్నారు. లేని పక్షంలో రాజకీయ పతనం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో ప్రొఫెసర్లు పీఎల్ విశ్వేశ్వర్ రావు, భాగయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో అంతా నిర్లక్ష్యమే..

- **అందరి సహకారంతో మీర్‌పేటను అభివృద్ధి పథంలో నడిపించాం**
- **కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి**

మీర్‌పేట కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, జనవరి 25: స్థానిక సంస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్ అధ్యక్షతన నిర్వహించారు. కౌన్సిల్ సమావేశానికి సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరైయారు. సర్పంచులు, ఎంపీటీల పదవి కాలం ముగిసిపోయినా స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకోవడం లేదని ఆమె ఆరోపించారు. ఎంపిటీసీ, సర్పంచ్‌ల ఎన్నికలే జరపనోళ్లు మున్సిపల్ ఎన్నికలు ఇప్పట్లో జరిపే పరిస్థితి కన్పించడం లేదన్నారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. స్థానిక సంస్థలలో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే బీఆర్ఎస్ మున్సిపల్ కార్పొరేషన్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. మీర్‌పేట పాలక వర్గం, అధికారులు సహకారంతో అభివృద్ధి వేగవంతంగా జరిగిందన్నారు. అందరు సహకరించడం వల్లే మూడు చెరువులను అభివృద్ధి చేసుకోవడం జరిగిందన్నారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయవలసి ఉందన్నారు. గతంలో చేసిన విధంగానే అధికారులు అదే స్ఫూర్తితో పెండింగ్ పనులు పూర్తి చేయించాలన్నారు. కాలనీలలో ఉన్న సమస్యలను కార్పొరేటర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కాలనీలలో ఉన్న సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఎక్కడ సమస్యలున్నా తన దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఆర్వో చంద్రశేఖర్, డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాస్, కార్పొరేటర్లు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లంబాడీల హక్కుల సాధనకు కలిసి పోరాడుదాం

బంజార సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ సభావత్ రాములు నాయక్

చర్లపల్లి, జనవరి 25: అదివాసీ, లంబాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అఖిల భారత బంజార సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ సభావత్ రాములు నాయక్ పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని సిరి గార్డెన్‌లో వలిగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమా నాయక్, అఖిల భారత బంజార సేవా సంఘ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్‌ల ఆధ్వర్యంలో బంజార సేవా సంఘ్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, లంబాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం ప్రకటిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని, బంజార, లంబాడీలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించి హక్కుల సాధనలో భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు.

మాజీ సర్పంచ్‌కు డాక్టరేట్

సిటీబ్యూరో, జనవరి 25(నమస్తే తెలంగాణ): ఉమ్మడి నల్గొండ జిల్లా తాటికోల్ గ్రామ మాజీ సర్పంచ్, సర్పంచుల ఫోరం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జూలూరు ధనలక్ష్మి గౌడ్ డాక్టరేట్ సొంతం చేసుకున్నది. గ్రామాభివృద్ధికి ఆమె చేసిన సేవలను కెనడాకు చెందిన బ్రామ్టన్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయం గుర్తించింది. బెంగళూరులో శనివారం ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేయగా, విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి ప్రతినిధులు, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి శివప్ప, సురేశ్ గుప్తా చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను ధనలక్ష్మి తీసుకున్నారు.

విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన

సిటీబ్యూరో, జనవరి 25(నమస్తే తెలంగాణ): జాతీయ రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా శనివారం ఆర్టీఏ అధికారులు ఎర్రమంజిల్‌లోని రవీంద్ర కేథన్ హై స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సి.రమేశ్ పాల్గొని రోడ్డు భద్రతపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

బ్యాంకులను ప్రైవేటీకరించబోమని హామీ ఇవ్వాలి

కేంద్ర ప్రభుత్వంపై ఏఐబీఈఏ వెంకటాచలం

సమావేశంలో మాట్లాడుతున్న ఏఐబీఈఏ వెంకటాచలం, బీఎస్ రాంబాబు, తదితరులు

కాచిగూడ, జనవరి 25: జాతీయ బ్యాంకులను ప్రైవేటీకరించబోమని 2025-26 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం హామీ ఇవ్వాలని ప్రభుత్వ రంగ బ్యాంకులను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం అన్నారు. ఏపీటీబీఈఎఫ్ 30వ త్రైవార్షిక మహాసభలు మొదటిరోజు కాచిగూడ మున్నూరు కాపు సంఘం మ్యాడం అంజయ్య హాల్‌లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వెంకటాచలం, ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి బీఎస్ రాంబాబు, ఇండియా యూనివర్సిటీ ప్రొఫెసర్ మాథ్యూస్, డాక్టర్ యుగల్ కిషోర్ రాయలు హాజరయ్యారు. అనంతరం వెంకటాచలం మాట్లాడుతూ, భారతదేశం ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకుని నిలబడగలిగింది ప్రభుత్వ బ్యాంకులేనని పేర్కొన్నారు. ఆర్థికాభివృద్ధికి, ప్రజాధనం భద్రత, గ్రామీణ ప్రాంతాల ప్రజల సేవలందించేందుకు దేశ ప్రగతి కోసం ప్రభుత్వ బ్యాంకులేనని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు బ్యాంకుల ఇష్టానుసారంగా అనుమతులు ఇస్తున్నదని ఆయన ఆరోపించారు. ఎగవేతదారులు వివిధ బ్యాంకులలో తీసుకున్న మొండి బకాయిలను కట్టే విధంగా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బ్యాంకింగ్ రంగంలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వంక ఉదయ్ కుమార్, పీవీ కృష్ణారావు, సమద్ ఖాన్ బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా లవ్ మై ఇండీ డాగ్ షో

షోలో పాల్గొన్న బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ వ్యవస్థాపక అధ్యక్షురాలు అక్కినేని అమల

కవాడిగూడ, జనవరి 25: బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్, మార్స్ ఫెట్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో లవ్ మై ఇండీ డాగ్ షో మూడో ఎడిషన్ వైభవంగా జరిగింది. దోమలగూడలోని చైతన్య విద్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో అనేక మంది వీధి కుక్కల ప్రేమికులు తమ ఇంటి కుక్కలతో పాల్గొన్నారు. యంగ్ వైజ్ ఇండీ, గ్రేట్ ఇండీ విభాగాలలో పోటీలు జరిగాయి. కార్యక్రమంలో పాల్గొన్న బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ వ్యవస్థాపక అధ్యక్షురాలు అక్కినేని అమల మాట్లాడుతూ, వీధి కుక్కల పట్ల ప్రేమను పెంపొందించడంతో పాటు వాటి సంరక్షణ కోసం అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. మార్స్ ఫెట్ కేర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సలీల్ మూర్తి మాట్లాడుతూ పెంపుడు జంతువుల సంక్షేమానికి కంపెనీ కట్టుబడితో ఉందన్నారు. తాము చేపట్టే కార్యక్రమం ద్వారా లక్ష్యాన్ని సాధిస్తామ న్నారు. అనంతరం, పోటీలలో పాల్గొన్న ప్రతి విభాగంలో విజేతలను ఎంపిక చేసి మార్స్ పెట్ కేర్ నుంచి బహుమతులను అందజేశారు.

రాజ్యాంగమే మన బలం

సీఎండీ బలరాం

హైదరాబాద్, జనవరి 25(నమస్తే తెలంగాణ): రాజ్యాంగమే మన బలమని, అంతా గౌరవించుకోవాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం అభిప్రాయపడ్డారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా సింగరేణి భవన్ సందర్శకుల గ్యాలరీలో రాజ్యాంగ ప్రతిని ఏర్పాటు చేశారు. ఈ ప్రతిని సీఎండీ బలరాం ఆవిష్కరించి మాట్లాడారు. దేశానికి పటిష్ఠమైన రాజ్యాంగాన్ని అందించిన మహానీయులను స్మరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీఎం కో ఆర్డినేషన్ ఎస్డీ ఎం.సుభాని, మార్కెటింగ్ జీఎం డీ రవిప్రసాద్ పాల్గొన్నారు.

అభినందన

పాకిస్థాన్, దుబాయ్ వేదికలపై జరుగనున్న చాంపియన్స్ ట్రోఫీలో బరిలోకి దిగే భారత జట్టుకు మేనేజర్‌గా ఎంపికైన హెచ్‌సీఏ కార్యదర్శి దేవరాజ్‌ను ఉప్పల్ స్టేడియంలో శనివారం అభినందిస్తున్న హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్

కలెక్టర్ అనుదీప్‌కు బెస్ట్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేట్ అవార్డు

సిటీబ్యూరో, జనవరి 25(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలో స్వీప్ కార్యక్రమం ద్వారా ఓటరు శాతం పెంచినందుకుగాను హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బెస్ట్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేట్ అవార్డు వరించింది. కాగా, ఈ అవార్డును తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా రవీంద్రభారతీలో శనివారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుమిదిని, చీఫ్ ఎలక్ట్రోల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, డిప్యూటీ సీఈఓ సత్యవతి పాల్గొన్నారు.

ఘనంగా ఉమెన్ మెగా కాన్క్లేవ్

ఒక వేదికపై విభిన్న రంగాల మహిళలు

ఉమెన్ మెగా కాన్క్లేవ్‌లో పాల్గొన్న మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద తదితరులు

బంజారాహిల్స్, జనవరి 25: మహిళా పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులను, విభిన్నమైన వృత్తుల్లో ఉన్న మహిళలను ఒక వేదికపై తీసుకువచ్చి వారిని ప్రోత్సహించేందుకు వైశ్య బిజినెస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో శనివారం బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్‌లో 'ఉమెన్ మెగా కాన్క్లేవ్' పేరుతో సదస్సు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారదతో పాటు పలువురు ప్రముఖులు ఈ సదస్సులో పాల్గొన్నారు. వివిధ రంగాల్లోని 100 మంది మహిళలు తమ విజయాలను గురించి వివరించారు. వీబీఎన్ వ్యవస్థాపకుడు ఇమ్మడి శివ కుమార్, వినీతా సురానా, జ్యోత్స్న తిరునగరి తదితరులు పాల్గొన్నారు.

భావాలకు తగిన చిత్రాన్ని గీసే సృజనశీలురు చిత్రకారులు

ఆర్ట్ గ్యాలరీలో 'రివైవింగ్ ది రూట్స్' చిత్ర ప్రదర్శన

హాజరై ప్రారంభించిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

కొండాపూర్, నవంబర్ 25: మనస్సులోని భావాలను అందమైన చిత్రాలుగా సృష్టించగల శక్తి చిత్రకారుల సొంతమని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ప్రముఖ చిత్రకారుడు కొండపల్లి శేషగిరి రావు గీసిన చిత్రాలతో ఆయన కుమారుడు వేణుగోపాల్ రావు ఆధ్వర్యంలో 'రివైవింగ్ ది రూట్స్' పేరిట శనివారం చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఇందుకు ముఖ్య అతిథిగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, శేషగిరిరావు గొప్ప చిత్రకారుడని, ఆయన చిత్రాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయన్నారు. మనస్సులోని భావాలు, ఆలోచనలను అద్భుత రూపాలుగా సృష్టించే సృష్టికర్తలు చిత్రకారులున్నారు. శేషగిరిరావును నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఇతిహాసాలు, చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానాలను అద్భుతంగా తెలియజేసేలా ఆయన చిత్రాలున్నాయన్నారు. 'రివైవింగ్ ది రూట్స్' పేరిట రూపొందించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ప్రదర్శనలో ఉంచిన చిత్రాలను ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కే లక్ష్మి, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ మోహన్ రెడ్డి, సీఎఫ్ఏ, జేఎన్ఏఎఫ్ఏయూ పెయింటింగ్ విభాగం హెచ్ఓడీ డాక్టర్ ప్రీతి సంయుక్తలతో కలిసి తిలకించారు. అనంతరం శేషగిరిరావు కుమారుడు వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ, నేటి యువ కళాకారులకు చిత్రకళపై మక్కువను పెంపొందించేందుకు ఈ ప్రదర్శన తోడ్పడుతుందని, 1940 నుంచి 2012వ సంవత్సరం వరకు నాన్న గీసిన 250 చిత్రాలతో చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశామన్నారు. ఆర్ట్ గ్యాలరీలో చిత్ర ప్రదర్శన ఫిబ్రవరి 5వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు చిత్రకారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సుచిత్ర బిస్కోప్ 2025లో విద్యార్థుల ప్రదర్శనలు, ప్రదర్శించిన కళారూపాలు

ఆకట్టుకున్న సుచిత్ర బిస్కోప్ 2025

సిటీబ్యూరో, జనవరి 25(నమస్తే తెలంగాణ): సుచిత్ర అకాడెమీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన విజువల్ అండ్ పెర్ఫార్మింగ్ ప్రదర్శన 'బిస్కోప్ 2025' విశేషంగా ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో అద్భుతమైన శిల్పాలు, క్లిష్టమైన సిరామిక్ ముక్కలు, ఆకర్షణీయమైన ఇన్‌స్టాలేషన్లు, శక్తివంతమైన టైడై క్రియేషన్లు, సున్నితమైన చేతి పనులు, ఎంబ్రాయిడరీ, ఆకర్షణీయమైన పెయింటింగ్స్‌తో పాటు సుమారుగా 250కి పైగా కళాత్మక చిత్రాలను విద్యార్థులు ప్రదర్శించారు. విజువల్ అండ్ ఆర్ట్ ఎగ్జిబిట్‌లకు జీవం పోస్తూ తమ అద్భుతమైన సంగీత, నృత్య ప్రదర్శనల ద్వారా ఉత్సవాలకు మరింత శోభ చేకూర్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ కళాకారిణి దీపానాథ్ హాజరై విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సుచిత్ర అకాడెమీ ప్రిన్సిపల్ దీపా కపూర్‌తో పాటు సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాణ్యమైన పరికరాల వాడుకతో విద్యుత్ ప్రమాదాలకు చెక్

విద్యుత్ తనిఖీ ప్రధాన అధికారి సీహెచ్ రామాంజనేయులు

ఘనంగా తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల మహాసభ

తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ రూపొందించిన డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ రామాంజనేయులు

సిటీబ్యూరో, జనవరి 25(నమస్తే తెలంగాణ): తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల 11వ వార్షిక మహాసభ శనివారం లక్డీకాపూల్‌లోని ఫ్యాప్సీ భవన్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి సీహెచ్ రామాంజనేయులు అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే నాణ్యమైన విద్యుత్ పరికరాలు వాడాలన్నారు. బీఐఎస్ ప్రమాణాలతో తయారు చేసిన ఎలక్ట్రిక్ ఉప కరణాలనే అన్ని ప్రదేశాల్లో వాడాలని, విద్యుత్ మరమ్మతులు క్వాలిఫైడ్ ఎలక్ట్రీషియన్‌తో మాత్రమే చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జేసీ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు మెంబర్ నక్క యాదగిరి, లైసెన్సింగ్ బోర్డు మెంబర్ నేమాల బెనర్జీ, మేడ్చల్ అధ్యక్షుడు ఏ.మహేందర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నామిని వెంకటేశ్ నేత, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్ద పుల్లారావు, డిప్యూటీ డీఈ రాజు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావుకు ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ మెడల్

సిటీబ్యూరో, జనవరి 25(నమస్తే తెలంగాణ): సికింద్రాబాద్ డివిజన్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లోని ఇంటెలీజెన్స్ విభాగంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న దొంతగాని శ్రీనివాస రావు ప్రతిష్టాత్మకమైన ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికయ్యారు. 1996లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఎస్ఐగా చేరిన శ్రీనివాసరావు ప్రయాణికులకు భద్రత కల్పించడంతో పాటు నేరాలను అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తూ అధికారుల మన్ననలను పొందారు. ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన తరువాత కూడా అదే స్ఫూర్తితో పలు క్లిష్టమైన కేసులను ఛేదించారు. ఇందులో భాగంగా 2010లో రెండు భారీ దొంగతనాలను పట్టుకోవడంతో పాటు కడపలో కొందరు పేరున్న రాజకీయ నాయకులను అరెస్టు చేసి, వారి నుంచి రైల్వే ఆస్తులను కాపాడారు. విజయవాడ, గుంటూరు డిటెక్టివ్ వింగ్ హెడ్‌గా పని చేసిన సమయంలో పెద్ద చోరీ కేసును ఛేదించి రూ.కోటి విలువైన సొత్తును రికవరీ చేశారు. 2021లో అక్రమ రైల్వే టికెట్ల బుకింగ్ కేసులో 100 మందిపై కేసులు నమోదు చేసి, 5 వేల రైల్వే టికెట్లను స్వాధీనం చేసుకున్నారు. గోదావరి, కృష్ణా నదుల పుష్కరాల సమయంలో క్రౌడ్ మేనేజ్‌మెంట్ కోసం పటిష్టమైన భద్రతా ప్రణాళికలు రూపొందించి రైల్వే, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రశంసలు అందుకున్నారు. రైళ్లలో పారిపోయిన సుమారు 1000 మంది పిల్లలను రక్షించి, సురక్షితంగా వారి కుటుంబ సభ్యులకు అప్పగించడం, రైళ్లలో ప్రయాణించే మహిళలకు, సిబ్బందికి భద్రత కల్పించడంలో ముఖ్య పాత్ర పోషించారు. పలు డ్రగ్ కేసులు, ప్రయాణికులకు సంబంధించిన 75 చోరీ కేసులను ఛేదించి కోటి రూపాయల విలువైన ఆస్తులను రికవరీ చేశారు. ఈ క్రమంలో శ్రీనివాసరావు అందిస్తున్న సేవలు, విధి నిర్వహణలో కనబరుస్తున్న ప్రతిభను గుర్తించిన భారత ప్రభుత్వం ఆయనకు ఇండియన్ పోలీస్ మెడల్‌ను ప్రకటించింది. ఈ సందర్భంగా సికింద్రాబాద్ జోన్ ఐజీ అరోమాసింగ్ ఠాగూర్, సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డీఎస్‌సి డెబాస్మిత్ సి బెనర్జీతో పాటు ఆర్‌పీఎఫ్ సిబ్బంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావును అభినందించారు.

కేంద్ర ఓబీసీ కులాలను వెంటనే వర్గీకరించాలి

బీసీలకు కేంద్రంలో మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

నాన్ క్రిమీలేయర్ ఆదాయ పరిమితిని 15 లక్షలకు పెంచాలి

జాతీయ బీసీ దళ్ రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు

సమావేశంలో అభివాదం చేస్తున్న కృష్ణమోహన్ రావు, కుమారస్వామి తదితరులు.

ఖైరతాబాద్, జనవరి 25: ఓబీసీ కులాల జాబితాను వెంటనే గ్రూపులుగా వర్గీకరించి రిజర్వేషన్లను అమలు చేయాలని పలువురు బీసీ నేతలు అన్నారు. జాతీయ బీసీ దళ్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం 'కేంద్రంపై బీసీల ధర్మ పోరాటం' అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కృష్ణ మోహన్ రావు మాట్లాడుతూ, జస్టిస్ రోహిణి 2023 జూలై 31న నివేదిక సమర్పించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు అమలులోకి తీసుకురాకపోవడం విచారకరమన్నారు. దేశంలోని 3,500 బీసీ కులాల్లో ఇప్పటికే వెయ్యి కులాలు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో కనీస ప్రాతినిధ్యం లేకుండా జీవిస్తున్నారని, ఆ నివేదికలో స్పష్టంగా చెప్పినా కేంద్రం పెడచెవిన పెట్టిందన్నారు. ఓబీసీ జాబితాను వర్గీకరించి రిజర్వేషన్లు కల్పించని కారణంగా ఎదిగిన కులాలే ఎదుగుతున్నాయని, అవకాశాలు రాని కులాలు నిర్వీర్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా గణనలో బీసీ కులగణనను చేపడుతామని గతంలో అప్పటి హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టంగా హామీ ఇచ్చినా, కేంద్ర ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని ఎందుకు వెనక్కి తీసుకుందో సమాధానం చెప్పాలన్నారు. ఓబీసీలకు అమలులో ఉన్న నాన్ క్రిమిలేయర్ ఆదాయ పరిమితిని కేంద్ర డీవోపీటీ గైడ్‌లైన్స్ ప్రకారం ప్రతి రెండేండ్లకోసారి పెంపు చేయాల్సి ఉన్నా, కేంద్రం ఉద్దేశపూర్వకంగా పెంచడం లేదన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న 8 లక్షల నాన్ క్రిమి లేయర్ ఆదాయ పరిమితిని రూ.15 లక్షలకు వెంటనే పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. జాతీయ బీసీ దళ్ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి మాట్లాడుతూ కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌పై బీజేపీ ప్రభుత్వం పక్కన పెట్టిందన్నారు. దేశంలో 75 కోట్ల బీసీ జనాభా ఉందని, కాని వారికి ఏటా కేవలం 2 వేల కోట్లు మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. కేంద్ర వైఖరికి నిరసనగా దేశవ్యాప్తంగా దశల వారీగా ఉద్యమాలను నిర్మిస్తామని, త్వరలోనే తమ ప్రతినిధి బృందం కర్ణాటక, తమిళనాడు, బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో పర్యటించనున్నదని తెలిపారు.